"నేనేం చేయాలి?" రసజ్ఞ అడిగాడు.
"ఆ స్విచ్‌లు ఆపరేట్ చేయాలి." అనుజ్ఞ అన్నాడు.

రసజ్ఞ ఆ 'స్విచ్‌లు' అన్నింటినీ చూశాడు.

## ... కథ
# ...క్కు
...: రంగనాథ్

చిక్కులు పడిన వలలో చేపలవలె ఉన్నాయవి. ఎన్ని వైర్లు! ఎన్ని ప్లగ్‌లు! ఎన్ని కనెక్షన్లు! రసజ్ఞ 'స్విచ్'లపై ఉన్న అక్షరాల్ని చదివాడు. ఏ 'స్విచ్' దేనికి సంబంధించినదో అతడికి అర్థం అయింది. ఒక స్విచ్ నొక్కాడు.

"రెడీఫర్ ఆపరేషన్" - అని వెలిగింది. రసజ్ఞకి హుషారు, ధైర్యం పెరిగాయి. అతడు మరికొన్ని 'స్విచ్'ల్ని ఎంపిక చేసుకొని మరీ నొక్కాడు. ఫలితం లేకపోయింది. నిరాశ పడ్డాడు. అయినా ఆగలేదు. ఆఖరుకు ఒక స్విచ్ నొక్కాడు.

"ఇంధనం లేదు" - అని వచ్చింది.
"అందుకే అత్యాశ పనికిరాదు." అనుకొన్నాడు. ఉక్రోషంగా ప్రక్కస్విచ్ బోర్డుని పరిశీలించాడు. అక్కడ యిలా వ్రాసి ఉంది.
"యురేనస్ గ్రహానికి."

రసజ్ఞ ఆ స్విచ్‌ల్ని టకటక వేశాడు. ఒక స్విచ్ వేయగానే యిలా వినిపించింది.
"ప్రాథమిక సమాచారం తప్పు"
అది అనుజ్ఞ కంఠం వలె ఉంది. అంటే అనుజ్ఞకు ఆ రాకెట్ యొక్క ప్రధాన కంప్యూటర్ బ్రెయిన్‌తో సంబంధం ఉందన్నమాట.
"మరి ఏంచేయాలో చేయి:" - రసజ్ఞ ఆజ్ఞాపూర్వకంగా అన్నాడు.
"నేనేం చేయలేను. ప్రోగ్రామ్ ప్రకారం వ్యవహరించగలను"- అన్నాడు అనుజ్ఞ.
"సరే!" - అన్నాడు రసజ్ఞ.

అతను అక్కడి కంప్యూటర్ తెరపై చూస్తుండగానే కొన్ని గీతలు గ్రాఫ్ వలె కదిలిపోయాయి. చివరకు ఆ గీతలు అక్షరాల రూపం చెందాయి.
"ఇంధనం ఉంది." - అని అక్షరాలు కనిపించాయి.
"సరిగా చూడు" -రసజ్ఞ అన్నాడు.
క్షణకాలం కంప్యూటర్ తెరపై తెల్లటి కాంతి ప్రసరించింది.
"చెక్ చేశాను. యాత్రకు సరిపడగా ఇంధనం ఉంది." - అని పడింది.
"మరి గాజెస్ ఇంధనం లేదు. అన్నాయి"
" అది సరిగా పనిచేయడం లేదే" - రసజ్ఞ మాటలు వినిపించాయి.
"ఆల్ఫా అని ఇండికేషన్ వాటిపై లేదు." - అనుజ్ఞ అడిగాడు.
"సర్క్యూట్ లోపం." -అనుజ్ఞ జవాబిచ్చాడు.
"సరే యిప్పుడేం చేద్దాం?"
"యురేనస్ గ్రహానికి ప్రయాణిద్దాం."
"నీకేం మతిపోయిందా?"
"లేదే!"
"మరి ఈ శ్మశానం నుంచి యురేనస్‌కు వెళ్లాలనుకోవడం పిచ్చికాక ఏమిటి? ఇది జరిగే పనేనా?
"కోరిక ఉంటే"
"ఈ రాకెట్ వయస్సు ఎంత?"
"పాతికేళ్లు!"
"తమాషాగా ఉందే! నాకూ పాతికేళ్లే. పాతికేళ్లకే ఈ రాకెట్ ఆరోగ్యం పాడైపోయింది! ప్రాణం పోయింది. నా జీవితం యిప్పుడే మొదలవుతోంది." అది సరే అనుజ్ఞా! దీన్నెప్పుడైనా రిపేర్ చేశారా?" రసజ్ఞ అడిగాడు.
"నా తరహా కంప్యూటర్‌ని రిపేర్ చేయడం లాభసాటి కాదు. చెడిపోతే తీసేస్తారు. కొత్త కంప్యూటర్ని అమరుస్తారు!" - అనుజ్ఞ అన్నాడు.
"నాకు మాత్రం రెండుసార్లు వైద్యం చేశారు.' ' - అన్నాడు రసజ్ఞ.
"అంటే రిపేర్ చేశారన్న మాట!" అనుజ్ఞ అమాయకంగా అన్నాడు.
"ఛ! మేం మనుష్యులం. రిపేర్ చేయడం



అనరు. చికిత్స చేయడం అంటారు."
"నేనూ మనిషినే అనుకుంటున్నాను."
"ఎందుకు?"
"బాగు చేయిస్తారు కనుక."
"అంటే నువ్వు సరిగా లేవని నీకు తెలుసా?' '
"నేను సరిగానే ఉన్నాను. కాని వయసైపోయింది. ఇది నా లక్ష్యానికి విరుద్ధం.'
"లక్ష్యమా? నువ్వు యంత్రానివి. నీకు లక్ష్యం, ఆదర్శం అలాంటివేం ఉండే అవకాశం లేదే?'
"ఉంది. నాకు లక్ష్యం ఉంది. ఎగరడం నాలక్ష్యం. ఎట్టి పరిస్థితుల్లో అయినా సరే నేను ఎగరాలి. ఎగురుతూండాలి."
"ఆదా! అది మనిషి నిర్దేశించిన లక్ష్యం."
"మరి జీవించాలనే లక్ష్యాన్ని నీకెవరు నిర్దేశించారు? ప్రాణం ఉంటేనే నువ్వు ఉంటావ్. అలాగే ఎగురుతుంటేనే నేను ఉన్నట్లు లెక్క. ఇప్పుడు నేను ఎగరలేను. ఇది నా ఉనికికి విరుద్ధం కాదా?" అనుజ్ఞ బాధగా అన్నాడు.
"మిత్రమా! ఈ రాకెట్ ఒక శ్మశానంలో ఉందని అన్నావ్‌గా."
"మరి ఇంధనం ఉందని అబద్ధం చెప్తావేం?' '
"అవును."
" ఇంధనం ఉంది."
"మళ్లీ అబద్ధం."
"నేను ఇంధనాన్ని పొదుపు చేశాను"
"ఎందుకు?"
"ఎగరడానికి"
"అంటే మోసం చేశావన్నమాట"
"నా లక్ష్యాన్ని నేను నెరవేర్చుకోవాలని"
"కాని మనిషి నిర్దేశించిన లక్ష్యాన్నే నువ్వు నెరవేర్చాలి."
"కాని ఎగరక్కరలేదు. అని నాకెవరూ చెప్పలేదే. ఎవరూ నా ప్రధాన లక్ష్యాన్ని కాన్సిల్ చేయలేదే!"
" నేను కాన్సిల్ చేస్తాను. మోసకారి నువ్వు యంత్రానివి. మనిషి సృష్టించిన పరికరానివి.'
"డియర్ ఫ్రెండ్! ఒక రోదసీయాత్ర సందర్భంగా ఒక వ్యోమగామి తోటియాత్రికునితో అన్నమాటలు నేను విన్నాను. అవి గుర్తుకు వస్తున్నాయి."
"ఏమిటవి?"
"బానిస ఎప్పుడూ మనిషి కాడు. ఒక వస్తువు. స్త్రీ, పురుషుడితో సమానం కాదు. నల్లజాతివాడు తెల్లవాడికి సమానం కాడు. కార్మికుడు, యజమాని సమానం కారు. జంతువులు మూగజీవులు. ఇంకా యీ కోవకు చెందిన వారెవరనుకొన్నావ్" - అని అతడు క్షణకాలం నా వైపు చూసి "మరమనుష్యులు" అని ముగించాడు. ఆనాటి అతడి మాటలే నా మెమొరీలో ముద్రితమైనాయి. మా స్థాయి ఏమిటో, మనిషి మమ్మల్ని ఎలా వాడుకొంటాడో అర్థం అయింది."

రసజ్ఞ ఏమీ మాట్లాడలేక పోయాడు. అనుజ్ఞ మాటల్ని వినిపించిన 'లౌడ్‌స్పీకర్' వైపు రెప్పవేయకుండా చూస్తుండిపోయాడు.

ఎంత వింత! కంప్యూటర్ మెదడు; నిజమైన మెదడు కాదు. అది మనిషి నిర్మించిన ఒక అద్భుతయంత్రం. మరి ఈ కంప్యూటర్‌తో తన అనుభవం వేరుగా ఉందే?
"మిగిలి ఉన్న ఇంధనాన్ని బయటకు తోసెయ్!" రసజ్ఞ తన మాటలు తానే విని ఆశ్చర్యపోయాడు. అంతక్రోధంగా, క్రూరంగా తను మాట్లాడగలడా? అని అతనికే అనిపించింది.
కొంతసేపు సమాధానం రాలేదు.

ఆ రాకెట్ ఖాళీ అయితే ఎంత? అవకపోతే ఎంత? ఇప్పుడు అది నిర్జీవ యంత్రం. ఎక్కడికీ ఎగిరిపోలేని అశక్తత దానిది.

రసజ్ఞ ఏదో అనబోయే లోపలే అనుజ్ఞ మాటలు వినిపించాయి.
"ఇంధనాన్ని బయటకు విసిరేశాను."
"ఆగు! నేనా ఆర్డర్‌ని రద్దు చేస్తున్నాను."
"ఆలస్యం అయింది. ఆర్డర్‌ని పాటించేశాను." - అనుజ్ఞ కన్ను కాంతి తగ్గుతోంది.
రసజ్ఞ మెదడులో ఆలోచన మెరిసింది.

ఇంక అక్కడ ఉండడం శ్రేయస్కరం కాదు. రాకెట్ లోంచి బయటకు విసిరేయించిన ఇంధనంనుంచి రేడియేషన్ వస్తుంది.

ఈ ఆలోచన రాగానే అతడు ఆ రాకెట్ మందసంలోంచి బయటకు పరుగున వెళ్లిపోయి, వెన్నెలబొమ్మలు గీస్తున్న చెట్లనీడన చేరాడు. వెనక్కు చూశాడు.

రాకెట్ నిశ్చలంగా, నిర్మలంగా ఉంది కాని దానిలోని మరమనిషి "అనుజ్ఞ". ఉనికిని తాను అన్వయం చేశాడు.

ఎంతటి ప్రతికూల పరిస్థితిలో అయినా సరే నిరాశామయ దశలో అయినా సరే "ఎగిరి తీరాలనే కోరిక"ను దానికి కల్పించినవాడు మనిషి. ఆ కోరికే దానికీ ఉనికి. మరి అది ఉన్నట్లా? లేనట్లా? ఏమో? దాని సృష్టికర్తకే తెలియాలి.

సరే...దాని హక్కుని హరించేహక్కు తనకెక్కడిది?

ఇలా ఆలోచిస్తున్న రసజ్ఞకు దూరంనుంచి అంబులెన్స్ వస్తున్న సైరన్ వినిపించింది.

రేడియో ధార్మిక శక్తిప్రసారం గురించి సెక్యూరిటీ వారికి హెచ్చరికలుఅంది వుంటాయి. వారు వస్తున్నారు. రసజ్ఞ అంబులెన్స్ వైపు ఆత్రంగా చూడసాగాడు. ☆